క్లుప్తంగా

హైమాస్ట్ లైట్ వెలగక ఇబ్బందులు



నడికూడ: మండలంలోని కంఠాత్మకూర్ గ్రామంలోని యాదవ్ కాలనీలోని హైమాస్ట్ లైట్ వెలగక రాత్రి వేళల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సుమారు ఆర్నెళ్ల క్రితం రూ.80 వేల వ్యయంతో ఆ హైమాస్ట్ లైట్ ఏర్పాటు చేయగా కేవలం వారం రోజులపాటు మాత్రమే వెలిగిందని గ్రామస్తులు తెలిపారు. ప్రభుత్వం వేలాది రూపాయలు వెచ్చించి ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్ వారం రోజులు మాత్రమే పని చేయడం పట్ల ప్రజలు మండిపడుతున్నారు. ఇప్పటికైనా హైమాస్ట్ లైట్ వెలిగేలా ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

లేగదూడల పంపిణీ



ఐనవోలు : మండలంలోని కక్కిరాలపల్లి గ్రామంలోని రైతులకు శ్రీమల్లికార్జున గోశాల ఆధ్వర్యంలో శుక్రవారం లేగ దూడలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ గోశాల ఫెడరేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు మహేష్ అగర్వాల్, అధ్యక్షుడు గాడిపల్లి రాజేశ్వర్‌రావు మాట్లాడారు. గ్రామంలోని 10 మంది రైతులకు 20 లేగ దూడలను పంపిణీ చేసినట్టు తెలిపారు. గోవులను పెంచడం వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయని తెలిపారు. గో ఆధారిత వ్యవసాయం వల్ల పంటల సాగులో నాణ్యత ఉంటుందని చెప్పారు. గోమూత్రం, పేడతో వ్యవసాయం చేయాలని సూచించారు. రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించాలని కోరారు. ఆరోగ్యకరమైన పంటల ఉత్పత్తికి గోమాత ఉపయోగపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ కంజర్ల రమేష్, గోశాల ప్రతినిధి గూడ యాదయ్య, కాడబోయిన కుమారస్వామి, రాజు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఉచిత బస్‌పాస్‌ల పంపిణీ



ధర్మసాగర్ (వేలేరు) : వేలేరు మండల కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్ వద్ద సర్పంచ్ కాయిత మాధవరెడ్డి అధ్యక్షతన హనుమకొండ డిపో మేనేజర్ బాబునాయక్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన 'ప్రజల వద్దకు ఆర్టీసీ' కార్యక్రమంలో భాగంగా మండలంలోని దివ్యాంగులకు శుక్రవారం ఉచిత బస్‌పాస్‌లు పంపిణీ చేశారు. అనంతరం ఉపసర్పంచ్ సద్దాం హుస్సేన్ మాట్లాడారు. మండల కేంద్రం మీదుగా పీచరకు నైట్‌హాల్ట్ బస్సును పునరుద్ధరించాలని, మండలంలోని అన్ని గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించాలని డీఎంను కోరారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఉద్యోగులు డీఆర్.రెడ్డి, జి.రాజయ్య పాల్గొన్నారు.

పరీక్ష ప్యాడ్ల అందజేత



శాయంపేట : మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల హైస్కూల్‌లో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు రిటైర్డ్ టీచర్ వనం సదానందం శుక్రవారం పరీక్ష ప్యాడ్‌లు, పెన్నులు అందజేసి మాట్లాడారు. విద్యార్థులు ఇష్టపడి చదవాలని సూచించారు. లక్ష్యాన్ని నిర్దేశించుకుని సాధన దిశగా ప్రణాళికాయుతంగా ముందుకు సాగాలని చెప్పారు. క్రమశిక్షణతో చదివి ఉత్తమ ఫలితాలు సాధించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బాలికల, బాలుర పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సీతామహాలక్ష్మీ, వెంకటేశ్వర్‌రావు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో విద్యుత్ బిల్లులు చెల్లించండి



ఆత్మకూరు : సకాలంలో విద్యుత్ బిల్లులు చెల్లించాలని ఆ శాఖ డీఈ సామ్యా నాయక్ కోరారు. మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం ఆయన తనిఖీలు నిర్వహించారు. 215 మందిపై విద్యుత్ చౌర్యం కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా డీఈ మాట్లాడారు. మీటర్లు లేని వ్యక్తులు దరఖాస్తు చేసుకుని పొందాలని సూచించారు. కార్యక్రమంలో ఏడీఈ దేవేందర్‌నాయక్, దానయ్య, గంగారెడ్డి, రాజు, జానకి రాంరెడ్డి, అశోక్ పాల్గొన్నారు.

రైతులకు రూ.లక్ష రుణమాఫీ చేయాలి



కమలాపూర్ : రైతు దీక్ష చేస్తున్న బీజేపీ నాయకులు

కమలాపూర్ : రైతులకు రూ.లక్ష రుణమాఫీ చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు కట్కూరి అశోక్‌రెడ్డి డిమాండ్ చేశారు. రైతు గోస–బీజేపీ భరోసా కార్యక్రమంలో భాగంగా తహసీల్దార్ కార్యాలయం ఎదుట కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం రైతు దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా అశోక్‌రెడ్డి మాట్లాడారు. ధరణి పోర్టల్ వల్ల రైతులకు ఇబ్బందులు ఎదురౌతున్నాయని, పీఎం ఫసల్ బీమా యోజన పథకాన్ని రాష్ట్రంలో అమలు చేయడం లేదని చెప్పారు. అనంతరం నాయబ్ తహసీల్దార్ మమతకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు బండి కోటేశ్వర్, జిల్లా అధికార ప్రతినిధి తుమ్మ శోభన్‌బాబు, మండల ప్రధాన కార్యదర్శులు భూపతి ప్రవీణ్, కొండం శ్రీనివాస్, నాయకులు అరవింద్, తిరుపతిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎల్కతుర్తి : కిసాన్ మోర్చా అధ్యక్షుడు బి.లింగయ్య ఆధ్వర్యంలో తహసీల్దార్ రవీందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆ పార్టీ మండల అధ్యక్షుడు కుడితాటి చిరంజీవి మాట్లాడారు. కార్యక్రమంలో జె.కిష్టయ్య, కె.కార్తీక్, సదానందం, మధూకర్, పెరుకు మధు తదితరులు పాల్గొన్నారు.



ఎల్కతుర్తి : వినతిపత్రం అందజేస్తున్న నాయకులు



నడికూడలో..

నడికూడ : బీజేపీ మండల కమిటీ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దార్ మహేందర్‌కు నాయకులు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు జీ.రాజిరెడ్డి, నాయకులు సాంబరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్‌పై వేధింపులు దుర్మార్గం



మాట్లాడుతున్న సింగపురం ఇందిర

ధర్మసాగర్ : స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గ పరిధిలో మహిళా సర్పంచ్‌పై ఎమ్మెల్యే లైంగిక వేధింపులకు పాల్పడడం దుర్మార్గమని కాంగ్రెస్ పార్టీ నియోజవర్గ ఇన్‌చార్జ్ సింగపురం ఇందిర అన్నారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లోనూ మహిళా ప్రజాప్రతినిధులపైనా, అధికారులపైనా బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు లైంగిక వేధింపులకు పాల్పడుతున్నారని ఆమె తెలిపారు. మండలంలోని జానకిపురంలో సర్పంచ్ కురుసపల్లి నవ్యను వరంగల్ నగర్ మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణ, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు బంక సరళతోపాటు ఇందిర శుక్రవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఇందిర మాట్లాడారు. ప్రజాసేవ చేసేందుకు మహిళలు రాజకీయాల్లోకి వస్తే బీఆర్‌ఎస్ పార్టీ ఎమ్మెల్యే లైంగిక వేధింపులకు పాల్పడుతున్నారని ధ్వజమెత్తారు. ఇలాంటి ఘటనలు ప్రతిరోజూ జరుగుతున్నా బహిర్గతం చేయడానికి భయపడుతున్నారని తెలిపారు. బీఆర్‌ఎస్ పార్టీ నాయకుల వేధింపులపై అధిష్టానం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. ఎమ్మెల్యేపై గతంలోనూ పలు ఆరోపణలు వచ్చాయని గుర్తు చేశారు. ఇకకైనా లైంగిక వేధింపులకు పాల్పడిన ఎమ్మెల్యేపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఎస్సీ సెల్ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ చేపూరి చిరంజీవి మాట్లాడుతూ దళిత సర్పంచ్‌కు జరిగిన అవమానాన్ని సహించేది లేదన్నారు. ఎమ్మెల్యే రాజయ్య వెంటనే రాజీనామా చేయాలని లేదా బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు గంగారపు అమృతరావు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గుర్రపు ప్రసాద్, పీఏసీఎస్ డైరెక్టర్ బొడ్డు లెనిన్, నాయకులు ఠాకూర్ ఉమ, జాలిగపు లక్ష్మీ, సద్దాం హుస్సేన్, లక్ష్మణ్ నాయక్, సంపత్, యమున తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు ఇబ్బందుల్లేకుండా బందోబస్తు



దర్గాలో పరిశీలిస్తున్న ఏసీపీ శివరామయ్య

దామెర : సైలానీ బాబా దర్గా ఉర్సు ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఇబ్బందుల్లేకుండా బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్టు పరకాల ఏసీపీ జూపల్లి శివరామయ్య తెలిపారు. ఈనెల 12 నుంచి 14 వరకు దర్గాలో గంధం ఉత్సవాలు నిర్వహించనున్న క్రమంలో ఏర్పాట్లను శుక్రవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. భక్తులకు సౌకర్యం కల్పించేలా జాతీయ రహదారికి ఇరువైపులా వాహన పార్కింగ్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. జాతరలో అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. తగినంతగా సిబ్బందిని నియమించి జాతీయ రహదారిపై ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట దర్గా పీఠాధిపతి మహమ్మద్ అబ్దుల్ హమీద్ (సైలానీ బాబా), శాయంపేట్ రూరల్ సీఐ శ్రీనివాసరావు, ఎస్సై ముత్యం రాజేందర్, ఖాదీమ్ హీ సైలానియా ఎస్‌కె.మోయిన్, పోతుల కొమ్మాలు తదితరులున్నారు.

మినీ అంగన్‌వాడీ కేంద్రాలు ప్రారంభం



రాములపల్లిలో మినీ అంగన్‌వాడీ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్, తదితరులు

కమలాపూర్ : మండలంలోని రాములపల్లి, కొత్తపల్లి గ్రామాలకు ఇటీవల కొత్తగా మంజూరైన మినీ అంగన్‌వాడీ కేంద్రాలను స్థానిక ప్రజాప్రతినిధులు శుక్రవారం ప్రారంభించి మాట్లాడారు. బాలింతలు, గర్భిణులు, చిన్నారులు అంగన్‌వాడీ కేంద్రాలను వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమాల్లో ఆయా గ్రామాల సర్పంచ్‌లు పుల్లూరి రాంచందర్‌రావు, బండారి కల్యాణి సంపత్, పీఏసీఎస్ చైర్మన్ పేరాల సంపత్‌రావు, డైరెక్టర్ తక్కళ్లపెల్లి సత్యనారాయణరావు, ఎంపీటీసీ వీరమనేని భాస్కర్‌రావు, ఉపసర్పంచ్ కుమారస్వామి, పంచాయతీ కార్యదర్శి రాజు, వార్డు సభ్యులు సరోజన, రఘుపతి, మాజీ ఉపసర్పంచ్‌లు పెర్క చక్రపాణి, వంటకాల కిషన్‌రెడ్డి, మాజీ వార్డు సభ్యులు బైరి భాస్కర్, కసరబోయిన రాజయ్య, నాయకులు పుల్లూరి శ్రీనివాసరావు, బిల్లా సమ్మిరెడ్డి, యాకూబ్‌రెడ్డి, కసరబోయిన శ్రీనివాస్, వంటకాల మల్లారెడ్డి, వీరారెడ్డి, పెరుగు రాజయ్య, పిట్టల సారయ్య, అంగన్‌వాడీ టీచర్లు బొంకూరి రజిత, చైతన్య, కవిత, వరలక్ష్మీ, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

'కంటి వెలుగు'ను వినియోగించుకోవాలి



దామెర : శిబిరాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్

దామెర : కంటి వెలుగు శిబిరాన్ని ప్రజలు వినియోగించుకోవాలని సీతారాంపూర్ సర్పంచ్ తుత్తురు శ్రీనివాస్ కోరారు. మండలంలోని ఆ గ్రామంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. అంధత్వ నివారణ కోసమే ప్రభుత్వం కంటి వెలుగు కార్యక్రమాన్ని చేపట్టిందని తెలిపారు. అనంతరం మెడికల్ ఆఫీసర్ సందీప్ మాట్లాడారు. కంటి సమస్యల పరిష్కారం కోసం పరీక్ష చేయించుకోవాలని చెప్పారు. దృష్టి లోపమున్న వారికి ఉచితంగా కళ్లద్దాలు పంపిణీ చేస్తారని తెలిపారు. అవసరమైతే శస్త్రచికిత్స కూడా ఉచితంగా చేస్తారని వివరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ శ్రీకాంత్, ఉపసర్పంచ్ కావటి రవి తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు : మండలంలోని గూడెప్పాడ్‌లో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని ఉపసర్పంచ్ వీసం శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించి మాట్లాడారు. గ్రామస్తులు కంటి పరీక్ష చేసుకోవాలని కోరారు.

ఆక్రమణదారులపై చర్య తీసుకోవాలి



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

పరకాల : పరకాల పెద్ద చెరువుకు, పెద్దమ్మ తల్లి ఆలయానికి వెళ్లే బండ్లబాటను ఆక్రమించుకుంటున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పరకాల ముదిరాజ్ సంఘం నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు తహసీల్దార్ జగన్ మోహన్‌రెడ్డిని, మున్సిపల్ కమిషనర్ టి.శేషాంజన్ స్వామిని శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ముదిరాజ్ సంఘం పరకాల కమిటీ అధ్యక్షుడు బోయిని రాజేష్ మాట్లాడారు. పట్టణ శివారులోని పెద్ద చెరువుకు, పెద్దమ్మతల్లి ఆలయానికి, వ్యవసాయ పొలాలకు వెళ్లేందుకు 30 ఫీట్ల రోడ్డు ఉండగా పక్కనే ఉన్న భూముల యాజమానులు ఆక్రమిస్తున్నారని తెలిపారు. సదరు రోడ్డు అభివృద్ధి కోసం ఇప్పటికే ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి నిధులు మంజూరు చేశారని చెప్పారు. ఆక్రమణదారులపై చర్యలు తీసుకోకపోతే ఆందోళన కార్యక్రమాలు చేపట్టాల్సి వస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు గొడుగు నాగరాజు, గొడుకు కుమార్, వీర్ల విజయ్, అల్లె రాజు, బొజ్జం స్వామి, సాదు పెద్దరాజు తదితరులు పాల్గొన్నారు.

రహదారుల అభివృద్ధికి ప్రాధాన్యం



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎంపీపీ

దామెర : రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల్లోని అంతర్గత రహదారుల అభివృద్ధికి ప్రాధాన్యమిస్తోందని ఎంపీపీ కాగితాల శంకర్ తెలిపారు. మండలంలోని పులుకుర్తి గ్రామంలో రూ.45 లక్షల అంచనా వ్యయంతో నిర్మించతలపెట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఆయన శుక్రవారం శంకుస్థాపన చేసి మాట్లాడారు. పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి మండలంలో అభివృద్ధి పనులు చేపట్టడానికి భారీగా నిధులు మంజూరు చేయిస్తూ అభివృద్ధిలో అగ్రగామిగా నిలుపుతున్నారని తెలిపారు. ప్రజలకు తాగునీటి, రోడ్లు, డ్రెయినేజీ, ఇతర వసతులు కల్పించేలా మండలంలోని అన్ని గ్రామాల్లోనూ అభివృద్ధి పనులు చేపడుతున్నట్టు తెలిపారు. గ్రామాల్లోనూ నెలకొన్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి నిధుల మంజూరీ కోసం చొరవ తీసుకుంటామని తెలిపారు. నిధులు మంజూరు చేయిస్తున్నందుకు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఎండీ.జాకిర్ అలీ, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గండు రాము, దళితబంధు చైర్మన్ గరిగె కృష్ణమూర్తి, బీఆర్‌ఎస్ అనుబంధ యూత్ వింగ్ అధ్యక్షుడు, ఉపసర్పంచ్ మెంతుల రాజు, పీఏసీఎస్ చైర్మన్ బొల్లు రాజు, సర్పంచ్ గోవిందు అశోక్, మాజీ ఎంపీపీ జున్ను మల్లయ్య, మాజీ ఎంపీటీసీ సుమలత, నాయకులు ఎడ్ల భాస్కర్, దండు రాజు, రమేష్, రాజు, రాంబాబు, మొగిలి, నాగరాజు, సూరయ్య పాల్గొన్నారు.

వేడుకగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం



పరకాల: స్థానిక మున్సిపల్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని వేడుకగా నిర్వహించారు. మహిళా ఉద్యోగులకు రంగవల్లి, వంటల, మెహందీ, క్రీడల, పాటల పోటీలు నిర్వహించారు. వైస్ చైర్మన్ రేగూరి విజయపాల్‌రెడ్డి, కౌన్సిలర్లు పోటీలను తిలకించి వంటకాలను రుచి చూసి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ సోదా అనిత రామకృష్ణ మాట్లాడుతూ కార్యక్రమాలు మహిళల్లో చైతన్యం నింపుతాయని చెప్పారు. కార్యక్రమంలో మెప్మా ఏడీఎంసీ టి.సతీష్, కౌన్సిలర్లు చందుపట్ల సుజాత, మడికొండ సంపత్‌కమార్, ఒంటేరు సారయ్య, దామెర మొగిళి, నల్లెల అనిల్, అడప రాము, బండి రాణి, శనిగరపు రజనీ, పాలకుర్తి గోపి, ఏకు రాజు, మున్సిపల్ సానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకట్‌రెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

ఉచితంగా విద్యుత్ అందించాలి



శాయంపేట : దళితులకు ఉచితంగా విద్యుత్ అందించాలని బహుజన సంక్షేమ సంఘం (బీఎస్‌ఎస్) ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి మొగ్గం సుమన్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని పత్తిపాక గ్రామంలోని దళితకాలనీలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దళితులకు ఉచితంగా విద్యుత్ అందిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చి అమలు చేయకుండా మీటర్లు పెట్టించుకుని బిల్లులు కట్టాలని ఒత్తిడి చేయడం సరికాదన్నారు. ఉచితంగా మీటర్లు, విద్యుత్ అందించాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో అంబేడ్కర్ విద్యార్థి సమాఖ్య జిల్లా కన్వీనర్ నాగుల పవన్ కల్యాణ్, నాయకులు పరమాండ్ల సురేష్, బోగం సాంబరాజు, కొంగర సుధాకర్, కొంగర సంపత్, బండి సదయ్య, అంకేశ్వరపు అనిల్, శారద, భారతి, రాధ, జయ, వసంత తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి నిధులు మంజూరు



పరకాల : సీఎస్‌ఐ చర్చ్ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరు చేసినట్ట పాస్టరేట్ చైర్మన్ వై.జాన్ తెలిపారు. నిధుల మంజూరీ పత్రాన్ని కౌన్సిలర్ మడికొండ సంపత్‌కుమార్ చేతుల మీదుగా శుక్రవారం ఆయన అందుకున్నారు. చర్చ్ అభివృద్ధికి నిధులు మంజూరి చేసినందుకు ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డికి, మున్సిపల్ చైర్‌పర్సన్ సోదా అనిత రామకృష్ణకు, కమిషనర్ టి.శేషాంజన్‌స్వామికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో చర్చ్ కార్యదర్శి బి.జాన్సన్, ఓ.ప్రేమ్‌కుమార్, బి.అశోక్, బి.ప్రజ్యోత్‌కుమార్, ఎ.కమలాకర్, బీఆర్‌ఎస్ నాయకుడు బండారి సుగుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

సంస్కృతీ సంప్రదాయాలపై అవగాహన కల్పించాలి

వరంగల్: విద్యార్థులకు సంస్కృతీ సంప్రదాయాలపై ఉపాధ్యాయులు అవగాహన కల్పించాలని 21వ డివిజన్ కార్పొరేటర్ ఎండి.ఫుర్కాన్ సూచించారు. ఎల్‌బీనగర్‌లోని స్కాలర్స్ హైస్కూల్‌లో అబ్దుల్ కలాం సైన్స్ ఫెయిర్ అండ్ కల్చర్ హెరిటేజ్ ఎగ్జిబిషన్‌ను సీఐ గూడూరు సతీష్‌కుమార్‌తో కలిసి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఫుర్కాన్ మాట్లాడుతూ విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని చెప్పారు. స్కూల్ చైర్మన్ సంగ వెంకటరాజం మాట్లాడుతూ కరోనా కాలంలో విద్యార్థుల మానసిక స్థితి, విద్యా పరిణామాలు కొంత ఆందోళన కారణంగా ఉన్నప్పటికీ తల్లిదండ్రుల ప్రోత్సాహం, ఉపాధ్యాయుల పట్టుదలతో విద్యార్థులను పూర్వ స్థితికి తీసుకురావడానికి ప్రయత్నం చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ సంఘ జీవనజ్యోతి, ప్రిన్సిపాల్ నాంపల్లి అశోక్, తదితరులు పాల్గొన్నారు.

సావిత్రిబాయి పూలేకు నివాళి



శాయంపేట : నివాళులర్పిస్తున్న నాయకులు



ఎల్కతుర్తి : నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

శాయంపేట : మండలంలోని పత్తిపాకలో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి అంబేడ్కర్ విద్యార్థి సమాఖ్య, బహుజన సంక్షేమ సంఘం, అంబేడ్కర్ యువజన సంఘం నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అంబేడ్కర్ యువజన సంఘం మాజీ గౌరవ సలహాదారు పి.సురేష్, మాజీ అధ్యక్షుడు బోగం సాంబరాజు, సావిత్రిబాయి పూలే సంఘం నాయకులు జయ, రమ, అచల రాధ, అనిత, కోమల పాల్గొన్నారు.

ఎల్కతుర్తి : మండలంలోని సూరారం గ్రామ శివారులోని సర్వే నంబర్ 566లో పేదలు వేసిన గుడిసెల స్థలంలో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి సీపీఐ మండల కార్యదర్శి ఉట్కూరి రాములు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆ పార్టీ మహిళా అధ్యక్షురాలు మర్రిపల్లి తిరుమల, జిల్లా సమితి సభ్యుడు మర్రి శ్రీనివాస్, నాయకులు గడ్డం లలిత, మాధవి, లక్ష్మీ, లావణ్య, భాగ్యలక్ష్మీ, రేవతి, దేవేంద్ర, తండ మొండయ్య, కుమారస్వామి, సురేష్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



ఐనవోలులో..

ఐనవోలు : మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎం శ్రీనివాస్‌రెడ్డి, తెలంగాణ తల్లి విగ్రహం వద్ద సీపీఎం మండల కార్యదర్శి కాడబోయిన లింగయ్య ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం శ్రీనివాస్‌రెడ్డి, లింగయ్య మాట్లాడగా కార్యక్రమాల్లో మహేందర్‌రెడ్డి, లక్ష్మయ్య, విద్యా వారధి అధ్యక్షుడు బీమళ్ల సారయ్య, సర్పంచ్ బండి పర్వతాలు, నాగరాజు, ఉమ, కవిత, రాణి, రాధిక, పోచమ్మ, ఎల్లమ్మ, సరోజన, పుష్ప, కోమల, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ప్రజావ్యతిరేక విధానాలు వీడాలి

- ఏఐకేఎస్ జిల్లా కార్యదర్శి చుక్కయ్య



మాట్లాడుతున్న చుక్కయ్య

ఐనవోలు : కేంద్రంలోని బీజేపీ ప్రజావ్యతిరేక, మతోన్మాద విధానాలు వీడాలని ఏఐకేఎస్ జిల్లా కార్యదర్శి ఎం.చుక్కయ్య హితవు పలికారు. మండల కేంద్రంలో ఏఐకేఎస్, ఏఐఏడబ్ల్యూయూ, సీఐటీయూ, జీఎంపీఎస్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కార్మిక, కర్షక, తదితర అన్ని రంగాల ప్రజావ్యతిరేక విధానాలు అవలంభిస్తోందని విమర్శించారు. పేదలపై అనేక రకాలుగా భారాలు మోపడంతోపాటు మతోన్మాదంతో ప్రజల మధ్య చిచ్చుపెడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ తప్పుడు విధానాలపై ప్రజలకు అవగాహన కల్పించి చైతన్యవంతం చేసేలా ఈనెల 20 నుంచి 25 వరకు 18 గ్రామాల్లో కార్మిక, కర్షక సంఘాల యాత్ర నిర్వహించనున్నట్టు తెలిపారు. ఏప్రిల్ 5న తలపెట్టిన ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో ఏఐకేఎస్ మండల అధ్యక్షుడు మడిగె నాగరాజు, నాయకులు కనకటి శంకర్‌రెడ్డి, అమ్మాయి, సలీం, మాదాసి రాధిక పాల్గొన్నారు.

'నాగుర్ల'కు జన్మదిన శుభాకాంక్షల వెల్లువ



పరకాల : కేక్ కట్ చేస్తున్న నాయకులు

పరకాల : ఆరె కుల సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు, తెలంగాణ రాష్ట్ర రైతు ఋణ విమోచన సంఘం చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్‌రావు జన్మదిన సందర్భంగా పట్టణంలో ఆ సంఘం ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆరె కుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు నాగుర్ల రాజేశ్వర్‌రావు, మండల అధ్యక్షుడు ఎడ్లె రమేష్, మండల ప్రధాన కార్యదర్శి అడగాని జనార్ధన్‌రావు, పట్టణ అధ్యక్షుడు నాగుర్ల శ్రీనివాసరావు, పట్టణ ప్రధాన కార్యదర్శి విజేందర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

నడికూడ : మండలంలోని నర్సక్కపల్లె గ్రామానికి చెందిన తెలంగాణ రైతు విమోచన కమిషన్ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లుకు జన్మదినాన్ని పురస్కరించుకుని ఆరె సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు లోకాటి నగేష్, తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రైతు విభాగం రాష్ట్ర అధ్యక్షుడు వరికెల కిషన్‌రావు పూలబొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు వాంకే రాజు పాల్గొన్నారు.

మహిళా రిజర్వేషన్ బిల్లును ఆమోదించాలి

వరంగల్ అర్బన్ : మహిళా రిజర్వేషన్ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి ఆమోదించాలని గ్రేటర్ వరంగల్ మహానగర మేయర్ గుండు సుధారాణి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈమేరకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి ఆమె శుక్రవారం లేఖ రాశారు. ఈ సందర్భంగా పలు అంశాలు పేర్కొన్నారు. మహిళా రిజర్వేషన్లకు సంబంధించిన ఎన్నికల హామీలను జాతీయ పార్టీలు తుంగలో తొక్కడం పరిపాటిగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. దేశ రాజధాని ఢిల్లీ వేదికగా బీఆర్‌ఎస్ పార్టీ ఎమ్మెల్సీ, జాగృతి రాష్ట్ర అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత దీక్ష చేపట్టారని తెలిపారు. ఈక్రమంలో ఆమెకు కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు అనేక రాష్ట్రాలకు చెందిన పార్టీలు, మహిళా సంఘాలు నాయకులు, మేధావులు మద్దతు ప్రకటిస్తున్నట్లు వివరించారు.